


శ్రీరామ్ తన క్యాబిన్‌లోకి వెళ్ళి కూచున్నాక, పక్క క్యాబిన్‌లో వున్న సుబ్బారావు నవ్వుతూ 'విష్' చేశాడు.

ఈ రోజు కొద్దిగా ఆలస్యమైనట్టుంది.

"అవునండీ దార్లో స్కూటర్ ట్రబులిచ్చింది." నోట్ల కట్టల్ని డినామినేషన్ ప్రకారం డ్రాయర్‌లో వేరు వేరు చోట్ల సర్దుకుంటూ సమాధానం చెప్పాడు.

ఆ బ్యాంక్‌లో శ్రీరాం పేమెంట్స్ కౌంటర్‌లో, సుబ్బారావు రిసీట్స్ కౌంటర్‌లో పని చేస్తున్నారు.

"ఫెస్టివల్ అడ్వాన్స్‌కి అప్లై చేసినట్టున్నారు." ఎంక్వయిరింగ్‌గా అడిగాడు సుబ్బారావు.

"పండగది కదండీ. అదీగాకుండా మా అబ్బాయి మొదటి పుట్టిన రోజు కూడా వుంది. ఉగాది వెళ్ళిన రెండో నాడే వాడు పుట్టేండు. మన స్టాఫ్ మొత్తాన్ని పిల్చి, గ్రాండ్‌గా పార్టీ ఇద్దామనుకుంటున్నాను" - అడ్వాన్స్‌కి అప్లై చేయాల్సిన అవసరం ఏమిటో వివరిస్తూ చెప్పాడు శ్రీరామ్.

కస్టమర్స్ వచ్చేప్పటికి ఎవరి పనుల్లో వారునిమగ్నమై పోయారు.

"సార్ - మీకు లెటర్" - మెసెంజర్ ఓ ఇన్‌లాండ్ లెటర్ తెచ్చి శ్రీరామ్ చేతికిచ్చాడు.

దాని మీది అడ్రస్ చూడగానే అర్థమైంది శ్రీరామ్‌కి ఆ లెటర్ ఎవరు రాశారో. క్యాజువల్‌గా ఓ సారి ఫ్రమ్ అడ్రస్ వైపు కూడా చూసి, దాన్ని జాగ్రత్తగా చింపాడు.

ఇవ్వాల్సిన పేమెంట్స్ అట్టే ఎక్కువగా లేవు.

లెటర్‌ని చదవటం ప్రారంభించాడు.

"సార్ - మీకు ఫోన్" మెసెంజర్ చెప్పిన వెంటనే ఉత్తరాన్ని తన పర్సనల్ నోట్ బుక్‌లో పెట్టి - క్యాష్ వున్న టేబుల్‌కి తాళం వేసి - క్యాబిన్ తలుపు కూడా వేసి అక్కౌంటెంట్ టేబుల్ దగ్గరకు నడిచాడు. ఫోన్‌లో ఓ నిముషం కూడా పూర్తిగా మాట్లాడలేదు శ్రీరామ్.

"నేను వెంటనే వచ్చేస్తున్నా." ఫోన్ పెట్టేసి మేనేజర్ రూమ్‌లోకి పరుగెత్తాడు శ్రీరామ్.

"సార్ మా బాబుకి సీరియస్‌గా ఉందిట-నేను లీవ్ పెట్టి వెళ్తాను-" ఆ మాటల్లో అభ్యర్థన కన్నా ఆందోళనా ఆతురతా యెక్కు  వున్నాయి.

మేనేజర్ పర్మిషన్ దొరికాక మరో క్యాషియర్‌కి క్యాష్ అప్పగించి హాస్పిటల్ వైపు తన స్కూటర్ మీద




ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో విద్యారణ్యులు - వారి రచనలు అంశంగా వరంగల్లులో జరిగిన యు.జి.సి. జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న ఆచార్య బి.రామ రాజు. కూర్చున్నవారు (ఎడమ నుంచి కుడికి) ఆచార్య ఎస్.లక్ష్మణమూర్తి, ఆచార్య పేర్వారం జగన్నాథం, ఆచార్య టి.వాసుదేవ్, ఆచార్య ఎస్వీ జోగారావు

దూసుకుపోయాడు శ్రీరావ్.

తన ముద్దుల కొడుకు వంశీ... తన ఒక్కగానొక్క కొడుకు...తన వంశోద్ధారకుడు - తన ప్రాణం.

"ఏమైంది బాబుకి" హాస్పిటల్ రూమ్‌లోకి ప్రవేశిస్తూనే అడిగాడు తన భార్యని.

శ్రీరావ్‌ను చూడగానే ఆవిడ భోరుమని ఏడ్చేసింది.

"ఏమో తెలీదండి. ఒక్కసారిగా వెంట వెంటనే వాంతులై పిల్లాడు కళ్ళు తేలేశాడు. వాడికి శ్వాస కూడా అందలేదు. రంగు మారిపోయాడు. చాలా భయపడి పోయానండీ" వెక్కిళ్ళ మధ్య చెప్పిందతని భార్య.

బెడ్ మీద వడలి పోయి - తోటకూర కాడలా పడి వున్న బాబు వైపు చూశాడు. కాంతితో మెరిసే కళ్ళతో చలాకీగా ఆడుకునే బాబుని అటువంటి స్థితిలో చూడగానే శ్రీరావ్ కళ్ళు చెమ్మగిల్లాయి.

"డాక్టర్ ఏమన్నారు?"

"తెచ్చిన వెంటనే రెండు మూడు ఇంజక్షన్లు ఇచ్చారు. మరో పది నిముషాలు ఆలశ్యమై వుంటే మన పిల్లాడు మనకు దక్కేవాడు కాదుటండీ." గొల్లుమని మరలా ఏడ్చేసింది.

నర్స్ వచ్చి థర్మామీటర్‌తో టెంపరేచర్ చూసింది. రెండు ఇంజక్షన్లు చేసింది.

నర్స్‌ని డాక్టర్ ఎక్కడ వున్నారో కనుక్కుని, అతని కోసం పరుగెత్తాడు శ్రీరావ్. తన బాబుని అలా ఇంజక్షన్లతో తూట్లు పొడిచేస్తుంటే ప్రాణం విలవిల్లాడి పోతోందతనికి.

"డాక్టర్ - మా బాబు కెలా వుంది." కన్నీళ్ళు కారుతుంటే, పసి పిల్లాడిలా అడిగాడు శ్రీరావ్.

"ఇరవై నాలుగు గంటలు గడిస్తే కానీ ఏ విషయం చెప్పలేమండీ. ప్రతి గంటకీ టెంపరేచర్ నోట్ చేయమని చెప్పాను. మరలా వాంతులు కాకుండా మందులు వాడుతున్నాం."

"డాక్టర్ - బాబుని ఎలాగైనా బ్రతికించాలి!"

"మా ప్రయత్నం మేం చేస్తాం - ఆ పైన దైవ నిర్ణయం" డాక్టర్ మాటల్లోని అనిశ్చితత్వానికి భయపడ్డాడు శ్రీరావ్.

ఆ రాత్రంతా అశాంతి - కంటి మీదికి కునుకు రాలేదు.

మాగన్నుగా నిద్ర పట్టినపుడల్లా ఏవేవో చిత్రాలు తన బాల్యం - తన తల్లిదండ్రులు - తను పెరిగిన పల్లెటూరు-

** ** **

చిన్నప్పుడు తనకూ ఇలానే సీరియస్ అయిందట. తన అమ్మా నాన్న ఆ రాత్రి తనని ఎత్తుకుని మూడు మైళ్ళున్న పట్నంవైపు పరుగెత్తారట. ఎంతటి దయనీయమైన దృశ్యం అది! అలా కళ్ళు తేలేసిన బాబుని ఎత్తుకుని ఆర్తిగా, ఆశగా తన తలిదండ్రులు- ఆ చీకట్లో- భయంతో బాధతో- టెన్షన్‌తో రోడ్డుమీద పరుగెత్తి డాక్టర్ కాళ్ళ మీద పడి బ్రతిమాలి ఎంతటి నరకం అనుభవించారో- ఎంతటి క్షోభ భరించారో—

** ** **

"మీ బాబు ఔట్ ఆఫ్ డేంజర్" అని రెండోరోజు డాక్టర్ చెప్పేవరకూ శ్రీరావ్ ఓ రకమైన అర్థ జాగృతావస్థలో గడిపాడు.

బాబుకి గండం గడిచింది. ఒక్కగానొక్క బాబు— తన వంశంలో సంతానం ఎప్పుడూ ఒక్కడే. తన తల్లిదండ్రులకు తను ఒక్కడే కొడుకు.

మరో రెండు రోజులు హాస్పిటల్‌లోనే వుండమన్నాడు డాక్టర్.

నిద్రాహారాలు లేక సగమైపోయాడు శ్రీరావ్.

ఉగాదికి ముందురోజు బాబుని డిశ్చార్జ్ చేశారు.

** ** **

ఉగాది వెళ్ళిన మరుసటిరోజు చాలా సంతోషంగా ఆఫీస్‌కెళ్లాడు శ్రీరావ్.

తన క్యాబిన్‌లోకి వెళ్ళి కూర్చున్న శ్రీరావ్‌ని ఇప్పటికి మళ్లే విష్ చేశాడు సుబ్బారావు.

"ఎలావుంది మీ బాబుకి?" పరామర్శించాడు.

ఉన్నత ప్రమాణాలతో ఉద్యమిస్తున్న విద్యాసంస్థ
లిటిల్ ఫ్లవర్
రెసిడెన్షియల్ కాలేజి
(ఇంగ్లీషు & తెలుగు మీడియా)
స్వంతస్థలం, శాశ్వత భవనాలు, విశాలమైన గదులు
డైరెక్టర్: ఫోన్ 788
బొప్పన బెనర్జీబాబు B.Sc., M.A.(Litt)
రాజేంద్రనగర్ 2 లైను గుడివాడ 521 301

- బైపి & ఎం.పి గ్రూపుల వారికే ప్రవేశం
- అనుభవ పరిణతి గల అధ్యాపకులచే బోధన
- ఆధునిక వసతి ● అధునాతన విద్యాసౌకర్యాలు
- ఇంటర్‌తో బాటు ఇంజనీరింగ్ & మెడికల్ ఎంట్రన్స్ శిక్షణ ● వ్యక్తిగత శ్రద్ధ ● పౌష్టికాహారం
- వైద్యసదుపాయం ● క్రమశిక్షణ ● ఆరోగ్య సంరక్షణ ● బాలికలకు విడిగా హాస్టల్
- జూనియర్ ఇంటర్ బైపి& ఎం.పి. అడ్మిషన్లు జరుగుచున్నవి.

ADWISE



డాక్టర్ వెంపటి చినసత్యం కూర్చిన 'హరవిలాసం' కూచిపూడి నృత్య నాటిక ప్రదర్శన ఇటీవల సికిందరాబాద్ 'తన్మయి' ఆధ్వర్యంలో జరిగిన సందర్భంగా- శివుడుగా మంజుభార్గవి, పార్వతిగా కమలారెడ్డి పాల్గొన్న ఒక దృశ్యం

''దేవుని దయవలన బాగుంది. వాడికి మరో జన్మ వచ్చినట్లే అనుకోండి. అసలు బ్రతుకుతాడని అనుకోలేదండి''- ఓ క్షణం పాటు శ్రీరామ్ కళ్ళలో అలా జరిగివుంటే ఎలా వుండేదోనన్న భయం స్పష్టంగా కన్పించి అదృశ్యమైపోయింది.

ఆ సాయంత్రం క్యాష్ అంతా ట్యాలీ చేసి స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టేశాక మరలా వచ్చి తన క్యాబిన్‌లో కూర్చున్నాడు.

తన పర్సనల్ నోట్‌బుక్ తీసి అందులో ఇప్పటి వరకూ అయిన ఖర్చులు - కాబోయే ఖర్చులు రాసుకోవడం ప్రారంభించాడు.

హాస్పిటల్‌లో అయిన ఖర్చు, రేపు 'బర్త్‌డే' పార్టీ అయ్యే ఖర్చు, తిరుపతి మొక్కు తీర్చుకొనడానికి అయ్యే ఖర్చు, ఇంటి ఖర్చు— ఇవన్నీ వేసుకుంటే తన జీతమూ- ఫెస్టివల్ అడ్వాన్స్- తను బ్యాంక్‌లో దాచుకున్న డబ్బు పోగా మరో వెయ్యి రూపాయిలు తక్కువ వస్తున్నాయి.

మొహమాట పడ్తూనే సుబ్బారావు వైపు తిరిగి "రేపు ఓ వెయ్యి సర్దగలరా... వచ్చే నెలలో ఇచ్చేస్తాను'' చాలా హంబుల్‌గా అడిగాడు శ్రీరామ్.

"ష్యూర్... ఇందాకే చెప్పివుంటే డ్రా చేసి ఇచ్చేవాడినిగా'' సుబ్బారావు చెప్పాడు నొచ్చుకుంటూ.

''అర్జెంట్ ఏం లేదులెండి. రేపిచ్చినా ఫర్వాలేదు.''

శ్రీరామ్‌కి ధైర్యం వచ్చేసింది. ఇక రేపటి ఖర్చు గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు.

నోట్‌బుక్‌ని మూసి డ్రాయర్‌లో పెట్టేముందు చూసుకున్నాడు అందులోంచి బైటికి కన్పిస్తున్న ఇన్‌లాండ్ లెటర్‌ని.

అపుడు గుర్తొచ్చింది. వారం క్రితం ఆ లెటర్‌ని సగం చదివి వదిలేసి వెళ్లటం

మరలా లెటర్ విప్పదీసి మొదటి నుంచీ చదవడం ప్రారంభించాడు.

''చిరంజీవి శ్రీరామ్‌కి! మీ తండ్రి శివరామయ్య దీవించి వ్రాయునది—

ఈ మధ్యకాలంలో ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు. కారణం తెలియదు.

నీవు చదువుకున్నవాడివి. పెద్ద ఉద్యోగస్థుడివి. నీకు చెప్పేటంత వాడిని కాను. నీవు అన్నీ అర్థం చేసుకోగలవన్న నమ్మకంతో రాస్తున్నాను.

నీకు తెలియంది కాదు. సాగు చేసుకుంటున్న భూమిని నీ చదువుకోసం పూర్తిగా అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ పల్లెటూర్లో మనకంటూ మిగిలింది మట్టితో కట్టిన ఈ ఇల్లొక్కటే. దీన్నికూడా మొన్న తాకట్టు పెట్టాను, మీ అమ్మ మందులకోసమని.

ఇక్కడ మాకు తిండికి జరగటమే కష్టంగా వుంది. కొన్నాళ్ళు నువ్వు ప్రతి నెలా కొంత డబ్బు పంపుతూ వచ్చావు. ఈ మధ్య కాలంలో అదీ మానివేశావు.

నీకూ బాధ్యతలు పెరిగాయన్న విషయం మాకు తెల్సు. మాది కూడా బాధ్యతే కదా. నీ అవసరాలు మానుకొని పంపమని మేము అడగము. నీవు ఎక్కడ వున్నా— పంపినా పంపకున్నా సుఖంగా వుంటే అంతే చాలు మాకు. నీ దగ్గిర మిగిల్తేనే ఏదో కొంత నెల నెలా పంపించు. మీ అమ్మకు ఓ పూట తిండి పెట్టిన సంతృప్తి అయినా మిగుల్తుంది నాకు.

మీ అమ్మ ఎలాగూ మంచం పట్టింది. నా ఆరోగ్యం కూడా అంతంతమాత్రమే. ఈ ముసలి ప్రాణాలు ఎపుడు ఎగిరిపోతాయో తెలియదు. నీవు పంపినా— మేము బ్రతికినంతకాలమే కదా.

ఇలా రాసి నీ మనస్సు నొప్పించడం మా అభిమతం కాదు.

ఇక్కడ చాలా ఇబ్బందిగా వుంది. కనీసం రెండొందలయినా పంపించేది.

నీ మనియార్డర్ కోసం నేనూ, మీ అమ్మ వేయి కళ్ళతో ఎదురుచూస్తుంటాం... కోడలికి, మనవడికి మా దీవెనలు.

ఇట్లు

నీ తండ్రి శివరామయ్య

ఉత్తరం చదవటం పూర్తవగానే శ్రీరామ్ బ్లాంక్‌గా శూన్యంలోకి ఓ నిముషం చూస్తూ ఆలోచించాడు.

తన అవసరాలకే డబ్బు సరిపోవడంలేదు. ఈ నెల అప్పుడే వేయి రూపాయిలు అప్పు చేస్తున్నాడు. వచ్చే నెల ఈ అప్పు తీర్చాలి. ఇటువంటి పరిస్థితిలో పంపడం ఎలా సాధ్యం?

ఆ ఉత్తరాన్ని చిన్నచిన్న ముక్కలుగా చింపి డస్ట్‌బిన్‌లో పడేశాడు.

బైటికి వచ్చి అందరినీ పేరుపేరున రేపటి బర్త్‌డే పార్టీకి ఆహ్వానించాడు.

అవును- అతను ఇపుడు తండ్రి.

అతనికి తన పసితనంలో అక్షరజ్ఞానం లేని అమ్మానాన్న తన కోసం పడిన కష్టాలు గుర్తుకు రాలేదు.

తనకు అనారోగ్యం చేసినపుడు అమ్మా నాన్న ఆ పల్లెటూరి నుంచి పట్నం మోసుకు వెళ్ళడం గుర్తులేదు.

సాగుచేసుకునే బంగారం లాంటి పొలాన్ని తన చదువుకి అమ్మడం గుర్తులేదు.

తన చదువైపోయాక, తను నిరుద్యోగ పర్వంలో వున్నప్పుడు తన తండ్రి వేరేవాళ్ళ పొలంలో కూలిపని చేసి తన ఖర్చులకు డబ్బులివ్వడం గుర్తు లేదు.

ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ కెళ్లేటప్పుడు తన అమ్మ ఒంటిమీద మిగిలిన బంగారం అమ్మి డబ్బులివ్వడం గుర్తులేదు.

అతనికి ఇవేవీ గుర్తులేవు గుర్తురావు. గుర్తున్నదల్లా రేపు తన కొడుకు వంశీకి గ్రాండ్‌గా జరపబోతున్న బర్త్‌డే పార్టీ.

ఎందుకంటే అతనిపుడు ఓ కొడుక్కి తండ్రి... ఓ తండ్రికి తనూ కొడుకన్న విషయం మరిచిపోయి చాలా కాలమైంది.